# గాలిగోపురము — ఎ.రాజేశ్వరి

## ఊరంతా హడావిడిగా వుంది

ఒకనాటి అగ్రహారం ఈనాటి ఆ వూరు. ఆ వూరంతా కలపి వెయ్యి గడప వుండదు. ఎన్ని కులాలున్నాయో అంతకు మూడింతలు ముఠాలు. ముఠాలకి రెండింతలు కుమ్ములాటలు. పల్లెటూరి అమాయకత్వంతో కూడిన పట్టుదలలు. ఆ పట్టుదలల్లోంచి ఆవేశకావేషాలు. కుట్రలు, కుయుక్తులు. చదరంగపు ఎత్తులు.

అన్నిటిలోనూ ఆరితేరిన వాళ్ళు వున్నారు ఆ వూళ్ళో. ఊరికి దాపుగా వున్నాయి సస్యశ్యామలమైన పంట పొలాలు, కొబ్బరి తోటలు, మామిడి తోపులు! అవన్నీ ఆ వూరివాళ్ళ ఐశ్వర్యానికి కారణమయితే. ఐశ్వర్యం తెచ్చే మిడిసిపాటు ఆ వూరి మనుషుల ప్రవర్తనలో తరచూ ప్రదర్శిత మవుతుంది.

ఎకరం కొబ్బరితోట, మరో ఎకరం మాగాణి వుండటానికికో ఇల్లు వున్నవాడు 'తాత'అనేటట్లు వుంటాడు. అవును మరి ఆ మట్టి, ఆ గాలి అటు వంటివి.

నోటితో అయ్! అయ్! అంటూనే నొసలుతో వెక్కిరించే జనం ఎక్కువ ఆ వూళ్ళో.

ఆ వూరికి ఈశాన్యంగా కొన్ని శతాబ్దాల కాలం నాటి కోదండ రామాలయం వుంది.

దాని శిల్పం అపురూపమైనది. రాముని విగ్రహం చిన్నదయినా ఆకర్షణీయమైన మూర్తి. విశాలమైన ఆవరణలో ఈశాన్యంగా కోనేరు... పావంచాలు. మరో ప్రక్క కళ్యాణ మండపం.

ఆలయ వాతావరణం ఆహ్లోదకరంగా వుంటుంది. చుట్టూ వున్న ప్రాకారం కూలి పోయింది.

గాలి గోపురం శిథిలమై పోయింది.

ఏకరాల కొద్దీ మాగాణి పొలం వుండే వూరి రాజకీయాల మధ్య కోదండ రాముడు కూడా రాతి బొమ్మలా నిలబడి పోయాడే కాని కోదండం ఎక్కు పెట్టలేకపోయాడు.

ధర్మకర్త మండలిలో ఎవరికి వారే యమునా తీరే! ఒకరు అవునన్నది మరొకరు కాదనడం, అంతే! ఆలోచనలు ఆచరణలోకి రావు. మళ్ళీ కొంత కాలం వాయిదా. ఈలోగా ధర్మకర్తల మండలి మారుతూ వుంటుంది. అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా అన్ని హంగులతో విలసిల్లాల్సిన దేవస్థానం వెలవెలపోతూ వుంది. వారిని వీరు, వీరిని వారు మధ్య మధ్య కరెంటు బిల్లులు కట్టక పోయేసరికి లోకానికి వెలుగునిచ్చే వేల్పయినా పూజారి దయాధర్మంగా వెలిగించే సంధ్యా దీపం వెలుగులో వెలగాల్సిందే.

' ఊళ్ళో వాళ్ళందరం బాగు పడుతున్నాం వూరి దేవుడు మాత్రం కునికి పాట్లు పడుతూ వున్నాడని అనుకున్నాడో, లేక పంచదార బ్లాకు చేసి రాత్రికి రాత్రి లక్షలు సంపాదించిన పాపం కడుక్కోవడానికో ఆలయాన్ని పునరుద్ధరిస్తానని గోవిందరావు ముందుకు వచ్చాడు.

గోవిందరావు ఏవేళా విశేషంలో అన్నాడో కాని మేం మాత్రం రాత్రికి రాత్రి గొప్పోళ్ళం అయిన వాళ్ళం కాదా అని చాలా మంది ముందుకు వచ్చారు.

ఆలయ పునరుద్ధరణ కమిటీ ఏర్పడి పనులు చురుకుగా సాగాయి.

స్వామి వార్కి వెండి తొడుగు, అమ్మవార్కి చిన్న చిన్న ఆభరణాలు. గుడి గోడలకి సున్నాలు. రంగులు, దీపాలు. అనుకొన్నవి. అనుకోనివీ చాలా అమరి పోయాయి. ఎవరికి తోచినవి వాళ్ళు భక్తి ప్రపత్తులతో సమర్పించుకుంటున్నారు.

ఎవరిచ్చారో ఏమో దేవుడు పరాకు పడకుండా భక్తులిచ్చే కానుకల మీద తమ తమ పేర్లు రాయించుకుని మరీ సమర్పించుకుంటున్నారు.

గాలి గోపురం నిర్మాణాన్ని పర్యవేక్షించే బాధ్యత ఎవరికి అప్పగించాలనే చోట చిన్న దుమారం లేచింది. తమ ప్రాంతం వాడు వీరభద్రాచార్యుల కివ్వాలని కొందరంటే కాదు అనుభవజ్ఞుడు పెద్ద పెద్ద ఆలయ నిర్మాణాలు చేసినవాడు గోవింద స్తపతికి ఇవ్వాలని కొందరి వాదన.'

గోవింద స్తపతి పేరున్న వాడే కావచ్చు. మన ప్రాంతం వాడు కాదు. దక్షిణాది నుంచి పొట్టచేత పట్టుకని కొడుకు కోడలితో వచ్చిన వాడని కొందరు.

ఎక్కడివాడయితేనేం. చేతిలో విద్య. బుర్రలో ఆలోచన వున్నవాడు కనుక ఆలయ పర్యవేక్షణకి తాంబూలం గోవింద స్తపతికి ఇవ్వాలని నిర్ణయించారు.

గోపుర నిర్మాణం గోవింద స్తపతి, అతని కుమారుడు కుమార గణపతి ఆధ్వర్యములో చురుకుగా సాగింది. లక్షల రూపాయిల ఖర్చుతో ఆలయ పునరుద్ధరణ పూర్తయింది.

నూతన గోపుర శిఖర ప్రతిష్ఠ ఆగమ శాస్త్ర ప్రకారం ఘనంగా జరపడానికి సర్వసన్నహాలూ పూర్తయినాయి. భక్త శిఖామణి, విశిష్టాద్వైత శిరోమణి, పరివ్రాజక ఆచార్య శ్రీశ్రీశ్రీ రామానుజాచారి గారి ఆధ్వర్యమున శిఖర ప్రతిష్ఠ. నలుమూలల నుంచి వేద పండితులు విచ్చేశారు.

హోమాలు, జపాలు తపాలు యథా విధిగా సాగిస్తున్నారు. వూరంతా హడావుడిగా వుంది.

ప్రతి ఇంటి ముంగిటా ముగ్గులు, మామిడాకు తోరణాలు. మనుషుల మొహాల్లో అలసటతో కూడిన ఆనందం.

పనులు పురమాయించే వాళ్ళు పురమాయిస్తూ వుంటే చేసేవాళ్ళు చేసుకుంటూ పోతున్నారు.


దేవాలయ ప్రాంగణంలో మట్టి నేలలో కళ్ళాపు చల్లేవాళ్ళు, చల్లిన కళ్ళాపు మీద ముగ్గులు పెట్టేవాళ్ళు. వేసిన పందిరికి తోరణాలు కట్టే వాళ్ళు. ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు.

తమ తరంలో ఆలయానికి ఇంత రంగ రంగ వైభవంగా ఉత్సవం జరుగుతుందని అర్చక కుటుంబం అనుకోలేదు. కల కళ్ళ ముందు రూపు దిద్దుకొన్నట్లయింది.

దశాబ్దాల తర్వాత దేవాలయానికి పుట్టిన భోగం వల్ల వాళ్ళు తృప్తితో తేలిపోతున్నారు.

ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. భజనలు చేసేవాళ్ళు భజనలు చేస్తున్నారు.

ఓ మూల కోలాటం వేసేవాళ్ళు కోలాటం వేస్తున్నారు. మరో మూల గుండెలు గుభిళ్ గుభిళ్ మన్పించేటట్లు తప్పెటగుళ్ళు వాయిద్యంతో లయబద్ధంగా నాట్యం చేసేవాళ్ళు.



జనం ఒకచోట కూర్చోకుండా అటూ యిటూ తిరుగుతూనే వున్నారు.

స్త్రీ పురుష బాల వృద్ధ భేధం లేకుండా అంతా భక్తిభావంతో వూగిపోతున్నారు. చుట్టుపక్కల గ్రామాల జనాభా అంతా అక్కడే వున్నారు. పెత్తనం చెలాయించడంలో ఏ వర్గమూ అవతలివాళ్ళకి తీసిపోకుండా జాగ్రత్తపడుతూనే వున్నారు.

ముహూర్తానికి ముందుగానే ఆచార్యస్వామి విచ్చేసారు. ఆయన రాకతో. ఇంకా అక్కడక్కడ వున్న భక్తులు వచ్చి చేరారు.

ఆచార్యుల దర్శనం కోసం కొందరు తహతహలాడితే, పాదాలు తాకాలని కొందరి తాపత్రయం.

ఆయన ఆశీర్వచనం అందుకోవాలని మరి కొందరి ఆత్రం. అంతా ముముక్షువులే!

ఆచార్యస్వామిని చుట్టూ చేరేవాళ్ళని అదిలించడంలో కుర్రసాములు సతమతమవుతున్నారు.

వేద ఘోష మిన్నుముడుతూ వుండగా సుముహూర్త సమయం ఆసన్నమయ్యేసరికి ఆచార్యస్వామి సంజ్ఞతో శిఖర ప్రతిష్ట జరిగింది.

భక్తుల గోవింద నామాలతో దిక్కులు పిక్కటిల్లాయి.

పాలకొల్లు బ్యాండు వంతపాడింది.

సన్నాయిమేళం శ్రుతి కలిపింది.

బాణాసంచా ఆర్భాటం అందర్నీ అలరించింది.

పసిడికుండల ప్రతిష్ట ముగిసింది.

ఎర్రరంగునీళ్ళు నిండిన దృష్టి గుమ్మడికాయని నేలకేసి కొట్టారు. నలభై ఆరు చెక్కలయ్యింది.

ఇంతలో గాలిగోపురం శిఖరాన పసిడి కుండలు బిగించడానికి సర్వేబాదుల పరంజాల మీద నిలబడిన కుమార గణపతి తలే తిరిగిందో, కాలే జారిందో కాని తూలి కింద పడ్డాడు.

పడటం పడటం నాపరాయి గచ్చుమీద పడ్డాడు.

అంతే తల పగిలిపోయింది. రక్తం మడుగులో కుమార గణపతి.

జరిగిన సంఘటనకి జనం నిర్ఘాంతపోయారు.

ఏం జరిగిందో అర్థమయ్యేసరికి అందరి మనసులు వికలమైపోయాయి. కాలూ చెయ్యీ ఆడక కొందరు, నోట మాట రాక కొందరు.

తేరుకొన్న జనం నోటి వెంట సానుభూతి వెల్లువ!

ఎవరి నోట విన్నా 'రామ! రామ! ఎంత దుర్ఘటన జరిగింది!' అనే.

అంత విషాదంలోనూ తొంగిచూసే వాళ్ళ తోపులాటలతో తొక్కిసలాటలతో రణగొణ ధ్వని హెచ్చయ్యింది.

తలకొక మాటగా తలపోయసాగారు జరిగిన దుర్ఘటన గురించి. ఉత్సవం తాలూకు ఉత్సాహం చల్లారింది. ఆచార్యస్వామి ఆత్మ, పరమాత్మల గురించి మాట్లాడారు.

పాటక జనం పుణ్యాత్ముడు పరమాత్ముడిలో కలసిపోయాడు అనుకొన్నారు.

అలాంటి సమయంలో అందరూ వేదాంతులేగా!

పోయినవాడు పుణ్యాత్ముడే. కాని పోయినవాళ్ళని నమ్ముకొని వున్నవాళ్ళ సంగతి?

భర్త తప్ప ఏమీ లేని అతని భార్యకి ఓదార్పు మాటల రూపంలో ఎన్నో హామీలు యిచ్చారు వూరి పెద్దలు.

కుమార గణపతి మరణంతో మైలపడిన ఆలయ ప్రాంగణానికి ప్రాయశ్చిత్త సంప్రోక్షణ సంస్కారాలు జరిపి చేతులు దులుపుకున్నారు.

ఖాయిలా పడ్డ కుమారగణపతి కుటుంబానికి చేయూతనిచ్చి ఆదుకునే చెయ్యే కరువయింది.

అవును మరి దేవుడితో యిచ్చిపుచ్చుకోడాలకి సంబంధించిన వ్యాపార లావాదేవీలు బోలెడు.

మీకోసం, మీ వూరి పనిలో మీ ముందు నా ప్రాణాలు పోగొట్టుకున్నానని మూగగా గాలిలో రోదించే కుమారగణపతి వల్ల ఎవరికి ఏం పని జరుగుతుంది?

మొదలునరికిన చెట్టులా కళ్ళముందే కొడుకు కూలిపోవడంతో తండ్రి కుంగిపోయాడు. వూరివాళ్ళ శుష్కప్రియాలూ, రిక్తహస్తాలతో విసిగిపోయాడు.

ఆ వూళ్ళో వుండలేక పొట్టచేతబట్టుకొని కోడలే కొడుకు అనుకుంటూ వూరు వదిలి వెళ్ళిపోయాడు.

మానవత్వం మమత మరచి మనసుల్నే రాళ్ళుచేసి దానికి మతం అనే ప్రాకారం కట్టి అస్తిత్వానికి నిదర్శనంగా గాలిపోపురాలు నిలబెడితే సరికాదు.

మనుషుల్లో దేవుడిని చూడగల్గాలి. ఆ దేవుడి అస్తిత్వానికి నిదర్శనంగా నిలవాలి గాలిగోపురాలు . లేకపోతే అవి గోపురాలుగా కాదు గాలిలో గోపురాలుగా మిగుల్తాయి.